కష్టాలు కనరు.. బస్సులు నడపరు!

సాధారణంగా డిమాండ్‌ను బట్టి సప్లై ఉంటుంది.. ఇది వ్యాపార సూత్రం కూడా.. అయితే ఆర్టీసీలో మాత్రం డిమాండ్ ఉన్నప్పటికీ బస్సులు నడపడం లేదు. ఈ ధోరణి ప్రయాణికులకు అర్థం కావడం లేదు. ఓ వైపు ప్రైవేట్ ట్రావెల్స్ బతిమలాడి ఎక్కించుకుంటుంటే.. తమ వద్దకే వచ్చి.. బస్సు కేటాయించాలని ఏళ్లుగా కోరుతున్నా అధికారుల చెవికెక్కడం లేదు. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.

- ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాలకు తగ్గిన సర్వీసులు
- శ్రీశైలం క్షేత్రానికి బస్సు కేటాయించని వైనం
- విజయవాడకు వెళ్లేందుకు ఇతర డిపోల బస్సులే గతి
- ప్రయాణికుల రద్దీ ఉన్నా పట్టించుకోని అధికారులు
- ఉన్నతాధికారులపై నెపం నెట్టివేస్తున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


ఆత్మకూరు ఆర్టీసీ డిపో

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో ఆత్మకూరు పట్టణం పెద్ద కేంద్రం. ఇక్కడ 50 సంవత్సరాల క్రితమే ఆర్టీసీ డిపో ఏర్పాటు చేశారు. ఈ డిపో నుంచి రాష్ట్ర రాజధాని అమరావతి, విజయవాడ నగరాలతో సమీపంలోని శ్రీశైలం క్షేత్రానికి ఒక్క బస్సర్వీస్ కూడా లేకపోవడం విమర్శలకు దారి తీస్తుంది. డిపో నుంచి గతంలో ఎన్నో పుణ్యక్షేత్రాలకు, జిల్లా కేంద్రాలకు బస్ సర్వీస్‌లు నడిపారు. ఇటీవల ఆర్టీసీకి భారీగా నష్టాలు వస్తున్నట్లు అధికారులు పేర్కొంటూ ఉన్న సర్వీస్‌లను తొలగించడం, అందులో డిమాండ్ ఉన్న రూట్లలో సర్వీసులను తీసేస్తుండటంతో ఇది ఏమి వ్యాపార సూత్రమని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో ఆత్మకూరు డిపో అంటేనే శ్రీశైల మహాక్షేత్రానికి వరుసగా బస్‌సర్వీస్‌లు ఉంటాయని, ఈ డిపో ఆధ్వర్యంలో శ్రీశైలంలో సాక్షి గణపతి, పాతాళగంగ లాంటి సైట్ సీయింగ్‌బస్సులు కూడా నడుస్తాయని ప్రయాణికులు భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం అవేవీ లేవనేది ఇక్కడికి వచ్చిన తరువాత వారికి అవగతమవుతోంది. ఇక్కడి డిపోలో.. 1970లో 40 సర్వీస్‌లు ఉండగా, 1990 నాటికి 125 సర్వీసులతో 700 దాకా సిబ్బంది కొనసాగారు. ప్రస్తుతం డిపోలో అద్దె బస్సులు కాకుండా ఆర్టీసీ బస్సులు కేవలం 34 సర్వీసులకే పరిమితమం కాగా.. సిబ్బంది కూడా 200 లోపే ఉన్నారు.

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు..

ఆత్మకూరు నుంచి విజయవాడకు బస్ సర్వీసులు లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆత్మకూరు,వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి మండలాల నుంచి దాదాపు వెయ్యి మందికి పైగా విద్యార్థులు గుంటూరు, విజయవాడ నగరాల్లోని వివిధ పాఠశాల, కళాశాలలో విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన వారు పలువురు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో కూడా పనిచేస్తున్నారు. వీరికి ఆత్మకూరు నుంచి ఎలాంటి బస్ సర్వీస్ లేకపోవడంతో రిజర్వేషన్ లేక ఇబ్బంది పడుతున్నారు. శని, ఆదివారాల్లో విజయవాడకు వెళ్లాలంటే కర్నూలు నుంచి వచ్చే వివిధ డిపోల బస్ సర్వీస్‌ల్లో రిజర్వేషన్లు చేయించుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. అయితే కొన్నిసార్లు అప్పటికే సీట్లు పూర్తవుతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో డ్రైవర్ వెనుక, కింద కూర్చొని, నిల్చొని ప్రయాణం సాగిస్తున్నారు.

రాజధానికి బస్ సర్వీస్ లేకపోవడం అన్యాయం..

జిల్లాలో నందికొట్కూరు, డోన్ లాంటి చిన్న డిపోల నుంచి విజయవాడకు ఏసీ, సూపర్ లగ్జరీ బస్‌లు నడుపుతున్నప్పటికీ ఆత్మకూరు డిపోలో విజయవాడ, అమరావతికి బస్ సర్వీస్‌లు ఒక్కటి కూడా లేవు. దీంతో రాజధానికి బస్ సర్వీసులు లేకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి ఒకప్పుడు 20కి పైగా సర్వీసులు ఉంటే నేడు 1, 2 సర్వీస్‌లు మాత్రమే నడుస్తున్నాయి. ఆత్మకూరులో సాయంత్రం కేవలం ఒక్క బస్ మాత్రమే శ్రీశైలానికి ఉండడంతో ప్రయాణికులు, భక్తులు ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి నిలబడి వెళ్లాల్సిన దుస్థితి. ఇలా డిపోలో బస్ సర్వీస్‌లు నడకపోవడంతో పాటు ఉన్న సర్వీస్‌లు తొలగించడం వల్ల ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. విజయవాడకు ఎంతో రద్దీ ఉన్నప్పటికీ సర్వీస్‌లు నడపకపోవడంపై ఆర్టీసీ అధికారులను ప్రయాణికులు పలుమార్లు నిలదీసిన సంఘటనలు ఉన్నాయి. గతంలో విజయవాడకు బస్ సర్వీస్‌లు నడుపుతామని అధికారులు ప్రకటించారు. అయితే కేవలం ఒక్క రోజు ఒకే సర్వీస్ మాత్రమే రాను, పోను తిరిగింది. ఇక ఆ తరువాత కనుమరుగైంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్ సర్వీస్‌లు నడపాలని కోరుతున్నారు.

ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు



ప్రయాణికులు విజయవాడకు వెళ్లాలంటే పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. పిల్లలను తీసుకుని విజయవాడకు వెళ్లాలంటే కష్టంగా మారింది. రెండు రోజులు ముందుగానే రిజర్వేషన్ చేయించుకుంటే తప్పా ఆత్మకూరులో సీట్లు దొరకని పరిస్థితి. అధికారులు స్పందించి విజయవాడకు బస్ సర్వీస్‌లు నడపాలి. **– తిమ్మారెడ్డి, ఆత్మకూరు**

డ్రైవర్ పక్కన కూర్చుని వెళ్తున్నాం




విజయవాడకు వెళ్లాలంటే కష్టాలు తప్పవు. రాత్రి 10, 11 గంటల సమయంలో వివిధ డిపోలకు చెందిన బస్సుల్లో విజయవాడకు వెళ్తున్నాం. కర్నూలు, ఇతర డిపోల నుంచి ఆత్మకూరుకు వచ్చేలోగా అప్పటికే రిజర్వేషన్‌తో నిండిపోతున్నాయి. ఫలితంగా డ్రైవర్‌ని బతిమలాడి ఆయన పక్కన కూర్చుని ప్రయాణం చేస్తున్నాం. ఆత్మకూరులో బస్ సర్వీస్ ఉంటే సురక్షితంగా విజయవాడకు వెళ్లచ్చు. **– హనుమంతరెడ్డి, సిద్దపల్లి**

కర్నూలు నుంచి విజయవాడకు అధిక బస్సులు ఉన్నాయి

కర్నూలు ఆర్టీసీ డిపో నుంచి విజయవాడకు అధిక సంఖ్యలో బస్సులున్నాయి. ఆత్మకూరు నుంచి సర్వీస్ నడపాలంటే కూడా ఆత్మకూరు డిపో నుంచి బస్సు కర్నూలుకు వెళ్లి అక్కడ నుంచి విజయవాడకు వెళ్లాలి. అందువల్ల ఆత్మకూరు ప్రయాణికులు కర్నూలు నుంచి వచ్చే బస్సుకే అధికంగా వెళ్తున్నారు. ఉన్నతాధికారులు ఆదేశిస్తే ఆత్మకూరు డిపో నుంచి సర్వీసు ఏర్పాటు చేస్తాం. ఇక శ్రీశైలం వెళ్లడానికి ఇతర డిపోల బస్సులు వస్తుండటంతో సర్వీసులను తగ్గించాం. **– మహేంద్రుడు, డీఎం, ఆత్మకూరు**

క్లుప్తంగా

జీఎన్ఎస్ఎస్‌కు 8వేల క్యూసెక్కుల నీటి విడుదల


జీఎన్ఎస్ఎస్ నుంచి విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి జీఎన్ఎస్ఎస్‌కు ఆదివారం 8వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డీఈఈ రఘునాథ్ తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి ఎస్ఆర్ఎంసీ ద్వారా 12వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉందని చెప్పారు. కాగా తెలుగుగంగ 2వేల క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 2 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు వివరించారు.

వీర జవాను కుటుంబానికి ఆర్థిక సాయం


వీర జవాను కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ల బృందం

పాములపాడు: ఉగ్రవాదుల దాడిలో అమరుడైన మండలంలోని కృష్ణానగర్ గ్రామానికి చెందిన వీర జవాను శిరిగిరి సురేంద్ర కుటుంబానికి నంద్యాల డాక్టర్ల మిత్ర బృందం ఆర్మీ మేజర్ డాక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ నెట్ల మహేశ్వరరెడ్డి, డాక్టర్ విజయ్‌బాబు రూ.50వేల చెక్కును అందేశారు. ఆదివారం వీర జవాన్ ఇంటి వద్దకు వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భవిష్యత్‌లో ఆ కుటుంబ సభ్యులకు వైద్యానికి సంబంధించి ఉచితంగా సేవలందిస్తామని పేర్కొన్నారు.

ఓంకారేశ్వరుడికి ఆరుద్రోత్సవ అభిషేకం


నిజరూపంలో ఓంకారేశ్వరస్వామి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని ఆరుద్రోత్సవం, అన్నాభిషేకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేపట్టినట్లు అర్చకులు చక్రపాణిశర్మ తెలిపారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

రూరల్ సీఐగా విజయభాస్కర్



నందికొట్కూరు: నందికొట్కూరు రూరల్ సీఐగా విజయభాస్కర్‌ను నియమించినట్లు జిల్లా పోలీసు శాఖ అధికారుల నుంచి ఆదేశాలు వచ్చేశాయి. ఈయన ప్రస్తుతం నందికొట్కూరు అర్బన్ సీఐగా వ్యవహరిస్తున్నారు. రూరల్ సీఐగా ఉన్న సుధాకర్‌రెడ్డిని వీఆర్‌కు బదిలీ చేసినట్లు సమాచారం.

చిత్రలేఖనం పోటీల్లో చిన్నారుల ప్రతిభ

నంద్యాల(అర్బన్): ఆజాదీకా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకొని ఇటీవల హైదరాబాద్‌లోని యంగ్ ఇన్‌ఫోస్ సంస్థ, భారత ప్రభుత్వం సాంస్కృతిక మంత్రిత్వ శాఖ మద్దతుతో నా మాతృభూమి పేరిట నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో నంద్యాలకు చెందిన కోటేష్ అకాడమీ చిన్నారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. అకాడమీ నుంచి 32 మంది చిన్నారులు బొమ్మలు వేసి పోటీలకు పంపారు. అందులో ఐదుగురికి బంగారు పతకాలు, 11మందికి స్పెషల్ జ్యూరీ అవార్డ్స్, 14మందికి డిప్లొమో అవార్డులు సాధించారు. కొరియర్ ద్వారా అవార్డులు, ప్రశంసా పత్రాలను చిన్నారులకు పంపారని కోటేష్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన వారిలో సాగర్, జ్యోషికారెడ్డి, ప్రణవి, వెంకటనాగనిరూప, శ్వేత ఉన్నారు.

అవయవ దానంపై అవగాహన


కరపత్రం ఆవిష్కరిస్తున్న వైద్యులు

నంద్యాలటౌన్: ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా నంద్యాల ఐఎంఏ, లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఆదివారం శ్రీ గురురాఘేంద్ర బ్యాంక్ కోచింగ్ విద్యార్థులకు అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ దస్తగిరి మాట్లాడుతూ వ్యక్తి జీవించి ఉండగానే ఒక మూత్రపిండాన్ని, కాలేయంలోని కొంత భాగాన్ని దానం చేసే అకాశం ఉందన్నారు. అలాగే మనిషి సాధారణంగా మరణించిన తరువాత ఆరు గంటల లోపు నేత్రాలు దానం చేయవచ్చన్నారు. ఐఎంఏ, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ఏటా దేశంలో అయవదానం లభించక ఐదు లక్షల మంది మరణిస్తున్నారన్నారు. డాక్టర్లు గెలివి సహదేవుడు, ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు జఫ్రుల్లా, లయన్స్ క్లబ్ కార్యదర్శి సోమేసుల నాగరాజు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ఎంపీ పూజలు


వేదపండితులతో మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

మహానంది: నంద్యాల పార్లమెంటు సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డి ఆదివారం మహానందిలో పూజలు నిర్వహించారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, వేదపండితులు రవిశంకర అవధాని స్వాగతం పలికారు. ఈ మేరకు ఆయన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో ఆయనకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. మహానందీశ్వరస్వామి వారికి నిత్యం అభిషేకం చేసేందుకు గిర్ జాతి ఆవును బహూకరిస్తానని చెప్పారని రవిశంకర అవధాని తెలిపారు.

సున్నిపెంటలో అక్రమ నిర్మాణాలు నిలిపివేయండి


జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీఓ సురేష్

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలో జరుగుతున్న అక్రమ కట్టడాలు నిలిపివేయాలని, ఇందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. ఆదివారం సాయంత్రం శ్రీశైలం మండల తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సున్నిపెంట గ్రామాన్ని పంచాయితీరాజ్ శాఖకు అప్పగించిందని, అయినప్పటికీ గ్రామంలో అక్రమకట్టడాలు కొనసాగుతూనే ఉన్నాయని, అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అక్రమ కట్టడాలను నిలిపివేయాలని, చేపడుతున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించినప్పటికీ అక్రమకట్టడాలు జరుగుతూనే ఉన్నాయని, ప్రజల నుంచి వాట్సాప్ లో ఫొటోలు వస్తున్నాయని, ఇక మీదట ఇలాంటివి జరిగితే అధికారులను బాధ్యులుగా చేస్తానని హెచ్చరించారు. నూతన నిర్మాణాలు జరగకుండా, కట్టిన ఇళ్లల్లో మరమ్మతులు ఉంటే సంబంధించిన వ్యక్తి గ్రామపంచాయితీ అధికారి, లేదా తహసీల్దార్ అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇసుక, ఇటుక, సిమెంట్, స్టీల్, అమ్మకపుదారులకు కూడా సమాచారం ఇవ్వాలని, అధికారుల అనుమతులు లేని వారికి విక్రయిస్తే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే 12 మంది అక్రమ కట్టడదారులపై కేసులు పెట్టామని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సున్నిపెంటలో జరుపుతున్న ఇంటింటి సర్వే మూడు వారాల్లోపు పూర్తి చేసి నివేదికలు అందజేయాలని చెప్పారు. డీపీఓ మంజుల వాణి, ఆర్డీఓ దాస్, జల వనరుల శాఖ ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, ఐటీడీఏ ఏపీఓ సురేష్‌కుమార్, ఎంపీడీఓ మోహన్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ బాలునాయక్ పాల్గొన్నారు.

భక్తులతో మహానంది కిటకిట


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


మాడవీధుల్లో వాహనాలు నిలపడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు

- వాహనాల పార్కింగ్ కోసం అవస్థలు
- ఆలయం చుట్టూ నిలుపుకున్న భక్తులు
- ప్రైవేటు వసతి గృహాలకు డిమాండ్

మహానంది: మహానంది క్షేత్రం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా వాహనాల పార్కింగ్ కోసం భక్తులు ఇబ్బందులు పడ్డారు. పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలు ఉన్నా భక్తులకు అవగాహన కల్పించకపోవడంతో వాహనాలను నందిసర్కిల్, ఆలయం చుట్టూ మాడవీధుల్లో నిలపడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పాటు దేవస్థానం ఆధ్వర్యంలో వసతిగృహాలు తక్కువగా ఉండటంతో అన్ని నిండిపోయాయి. ప్రైవేటు వసతి గృహాలకు డిమాండ్ నెలకొంది. సాధారణ రోజుల కంటే లాడ్జీల వారు అధికంగా వసూలు చేసి భక్తులకు ఇబ్బందులు కల్పించారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఆత్మకూరు: సైబర్ నేరగాళ్ల చేతుల్లో ప్రజలు మోసపోవద్దని ఆత్మకూరు ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి సూచించారు. పట్టణంలోని పాతబ స్టాండ్ వద్ద సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యతిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని చెప్పారు. ఫోన్లలో ఓటీపీ, ఓఎల్ఎస్, పేటీఎం, గూగుల్‌పే,ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. మోసపోయిన వారు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఇటీవల కొందరు మహిళలు, పిల్లలను టార్గెట్ చేసి మోసాలకు పాల్పడుతున్నారని, ఇంటర్నెట్‌ను పరిమితికి మించి వాడడం వల్ల నష్టం తప్ప, లాభం ఉండదన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి


శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని సన్మానిస్తున్న లక్ష్మీకాంతారెడ్డి

నందికొట్కూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానని నందికొట్కూరు సహకార సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలో సహకార సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి కీలక పాత్ర పోషించిన సిద్ధార్థరెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఉంటుందన్నారు. రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిలకడగా శ్రీశైలం బ్యాక్‌వాటర్


ముచ్చుమర్రి పంప్‌హౌస్

పగిడ్యాల: శ్రీశైలం రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో నిలిచిపోవడంతో బ్యాక్‌వాటర్ నిలకడగా ఉందని ముచ్చుమర్రి పంప్‌హౌస్‌లో 863 అడుగుల సామర్థ్యం మేరకు నీరు నిల్వ ఉన్నట్లు పంప్‌హౌస్ ఏఈ శశికుమారి ఆదివారం తెలిపారు. మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వర్షధారం కింద సాగు చేసిన మొక్కజొన్న పైర్లు వాడిపోతున్నాయి. పంటను కాపాడుకోవడానికి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కేసీసీ లిఫ్ట్ ద్వారా కృష్ణా జలాలను విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. అయితే కేసీ కాలువ నీటిపారుదల శాఖ అధికారులు కృష్ణా జలాలను కేసీ కాలువకు వెయ్యి కూసెక్కులు విడుదల చేసేందుకు ప్రభుత్వ అనుమతి కోరామని డీఈ రఘురామిరెడ్డి చెప్పారు. నీటిని విడుదల చేయకపోతే రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, బీరవోలు, సంకిరేణిపల్లె, ప్రాతకోట, ఘణపురం, లక్ష్మాపురం తదితర గ్రామాల రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ముచ్చుమర్రి పంప్‌హౌస్ పర్యవేక్షక ఏఈ శశికుమారిని అడుగగా ప్రభుత్వ నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే కృష్ణా జలాలను కేసీకి లిఫ్ట్ ద్వారా అందిస్తామని తెలిపారు.

జవాన్ శివగంగాధర్ సేవలు మరువలేనివి


శివగంగాధర్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఆర్మీ జవాన్ పోలుకంటి శివగంగాధర్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఆర్మీ రిటైర్డ్ మేజర్ డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. ఆదివారం నంద్యాల వైద్య బృందం డాక్టర్ విజయ్‌బాబు, డాక్టర్ నేట్ల మహేశ్వరరెడ్డిలతో కలసి ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆర్మీ జవాన్ తల్లిదండ్రులను సన్మానించారు. ముందుగా శివగంగాధర్ కుటుంబాన్ని పరామర్శించి, అతని సమాధి వద్ద ఏర్పాటు చేసిన విగ్రహానికి పూలమాల వేసి, సమాధిపై జాతీయ జెండా ఉంచి నివాళులర్పించారు. అలాగే శివగంగాధర్ తల్లిదండ్రులైన పోలుకంటి రాములమ్మ, రాముడును సన్మానించారు. కుటుంబానికి ఆర్థిక చేయుతగా రూ.25 వేలు అందజేశారు. ఆయన తల్లిదండ్రులకు ఎటువంటి వైద్యసేవలు అవసరమైనా నంద్యాల వైద్య బృందం ఉచితంగా అందిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు రాంప్రసాద్, జయరాం శంకర్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న శ్రీ 'మహంకాళి' కమిటీ సభ్యులు


పట్టువస్త్రాలను తీసుకెళ్తున్న శ్రీమహంకాళి ఆలయ కమిటీ సభ్యులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు హైదరాబాద్‌లోని చారిత్రాత్మక లాల్ దర్వాజా సింహవాహిని శ్రీమహంకాళి దేవాలయం కమిటీ ప్రతినిధులు ఆదివారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు కె.వెంకటేష్, కె.విష్ణు గౌడ్,మాణిక్ ప్రభుగౌడ్, సి.రాజ్‌కుమార్, లక్ష్మీ నారాయణ గౌడ్, ప్రదాన కార్యదర్శి బి.మారుతి యాదవ్, ప్రతినిధులు ఎ.వినోద్‌కుమార్, చంద్రకుమార్, శేషు నారాయణ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి ఏఈఓ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కాగా ఏటా బోనాల ఉత్సవాల అనంతరం శ్రీశైల స్వామి అమ్మవార్లను దర్శించుకొని పట్టువస్త్రాలు అందజేయం ఆనవాయితీ అని కమిటి సభ్యులు తెలిపారు.

పగిలిన లింగాల లిఫ్ట్ ప్రధాన పైపు

- పొలాలకు అందని సాగు నీరు
- ఆందోళనలో రైతులు


పైపులైన్ పగిలిన ప్రాంతాన్ని చూపుతున్న రైతులు

పాములపాడు: లింగాల ఎత్తిపోతల పథకం ప్రధాన పైపు రెండుచోట్ల పగలడంతో పంట పొలాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. పథకం కింద మండలంలోని లింగాల, కొత్తపల్లి మండలంలోని కొక్కెరంచ, నాగంపల్లి, ఎదురుపాడు గ్రామాల్లో సాగులో ఉన్న 4,500 ఎకరాలకు నీరు సరఫరా అవుతుంది. ఈ నెల 11న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ నీటి విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిల్లో నీటి విడుదలతో పంటలకు మేలు చేకూరుస్తుందని భావించిన రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. ప్రధాన పైపు లైన్ పగలడంతో. మరమ్మత్తులకు లిఫ్టు సంఘం బ్యాంకు ఖాతాలో డబ్బులు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎత్తిపోతల పథకం నుంచి 1.50 కి.మీ. వద్ద పైపు లైన్ పగిలింది. ఈ పథకం ప్రారంభమై 12 సంవత్సరాలు కావచ్చింది. అయితే ఇప్పటి వరకు ఒకే సారి రెండు చోట్ల పైపు పగలడంతో ఇదే ప్రథమం.

ఖర్చుతో కూడుకున్న పని

పైపులైన్ రెండు చోట్ల దెబ్బతినింది. మరమ్మతులు చాలా ఖర్చుతో కూడుకున్న పని. ప్రతి సంవత్సరం మెయింటెనెన్స్‌కు దాదాపు రూ.10లక్షలు ఖర్చు అవుతోంది. నేను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పథకం అభివృద్ధికి నిధులు ఖర్చు చేశాం. రేపు రైతులతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటాం. **–విష్ణువర్ధన్‌రెడ్డి, పథకం చైర్మన్, కొక్కెరంచ**

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

పాములపాడు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం సిద్ధిస్తుందని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ చిన్నన్న తెలిపారు. ఆదివారం స్థానిక జెరూసలేం శాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతో కోసం యోగా, ప్రార్థనలు చేయాలన్నారు. అనంతరం షుగర్, బీపీ, థైరాయిడ్ రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య బృందం శ్వేత, దొరకమ్మ, శిరీష, ఎస్తేరు, పాస్టర్ సంసాన్‌ప్రా, మనిమాలమ్మ పాల్గొన్నారు.

మిడుతూరు: ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయుర్వేద డాక్టర్ శివకుమార్ దండె తెలిపారు. ఆదివారం మండలంలోని ఉప్పలదడియ గ్రామంలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో శ్రీ ధన్వంతరి ఆయుర్వేదిక్, పంచకర్మ, ఫిజియోథెరపీ అండ్ క్షారసూత్ర హాస్పిటల్ కర్నూలు వారి ఆధ్వర్యంలో 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు జాగృతి, డాక్టర్ పీజీఎస్ రాజు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్లు షమీర్, హసీనా పాల్గొన్నారు.

స్పందనను సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు రూరల్ : సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..ప్రజలు తమ సమస్యలు ఏవైనా ఉంటే వాటిని అర్జీల రూపంలో అధికారులకు అందజేయాలని మండల స్థాయి అధికారులు తప్పకుండా స్పందనకు హాజరు కావాలని కోరారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

మహానంది: గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠినచర్యలు తప్పవని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. బుక్కాపురం గ్రామంలో ఆదివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గ్రామాల్లో తరచూ ఘర్షణలకు పాల్పడేవారిపై సమాచారం ఇవ్వాలని సూచించారు.

15న మాంసం విక్రయాలు నిషేధం


ఆత్మకూరు: పట్టణంలో ఈ నెల 15 వ తేదీన చికెన్, చేపలు విక్రయాలను నిషేధించామని ఆత్మకూరు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాంసం విక్రయాలు పూర్తిగా నిషేధమని, నిబంధనలకు అతిక్రమించి వ్యాపారాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాంసం, చేపలు అమ్మరాదని, అలాగే వాటితో తయారైన ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన చాకలి సాంబశివుడు

పాములపాడు: అప్పుల బాధతో సాంబశివుడు (37) అనే కౌలు రైతు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బానుముక్కల గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ ఏసయ్య తెలిపిన వివరాల మేరకు.. సాంబశివుడు మూడేళ్లుగా పొలాన్ని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నాడు. అయితే సరిగా పంటలు పండకపోవడంతో దాదాపు రూ.5లక్షలు అప్పులపాలయ్యాయి. అప్పులు చెల్లించలేనేమోనని ఆందోళనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి


మృతిచెందిన స్వాములు (ఫైల్)

జూపాడుబంగ్లా: వైఎస్సార్ కడప జిల్లా రాయచోటిలో తాటిపాడు గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ స్వాములు(38) విద్యుదాఘాతంలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. జీవనోపాధిలో భాగంగా స్వాములు రాయచోటిలో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం రాయచోటిలో టిప్పర్‌లోని టైర్లను అన్‌లోడ్ చేస్తుండగా టిప్పర్‌కు విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతం సంభవించడంతో డ్రైవర్ సీటులో ఉన్న స్వాములు విద్యుదాఘాతంలో అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ యాజమాన్యం ఫోన్‌చేసి స్వాములు కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయటంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ రాయచోటికి వెళ్లారు. మృతుడికి భార్య పార్వతమ్మ, ఇద్దరు కుమారులున్నారు.